క్లుప్తంగా

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



సీతారాముల కల్యాణం జరిపిస్తున్న భక్తులు

రాజాం సిటీ: స్థానిక కంచర వీధిలోని శాస్త్రా సమాజంలో సీతారాముల కల్యాణోత్సవం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకం చేయడంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారాముల కల్యాణం కనులపండువగా చేశారు.

మెనూ తప్పనిసరిగా అమలు చేయండి



తెర్లాం: వెలగవలస పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న ఎంఈవోలు త్రినాధరావు, పాపారావు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాలకు సంబంధించి, రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని ఎంఈవోలు త్రినాధరావు, పాపారావు సూచించారు. మండలంలోని వెలగవలస ప్రాథమిక పాఠశాలను ఆయన సోమవారం సందర్శించి, విద్యార్థుల కోసం సిద్ధం చేస్తున్న మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలు తయారు చేశారా, లేదా చూశారు. వంటకాలు రుచి, శుచి కలిగి ఉండాలని తెలిపారు. మెనూ సక్రమంగా అమలు చేయకపోతే చర్యలకు వెనుకాడేది లేదని హెచ్చరించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్ల వినియోగం, పాఠశాల రికార్డులను వారు పరిశీలించారు.

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యా ప్రమాణాలు బాగున్నాయని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆ పాఠశాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు.

పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయండి



మాట్లాడుతున్న తహసీల్దారు సత్యం

సంతకవిటి: హౌసింగ్ లిస్ట్‌లో ఉన్న లబ్ధిదారులకు త్వరితగతిన పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని తహసీల్దారు బి.సత్యం సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో డీటీ మధు, ఆర్ఐ కృపారావులతో కలిసి వీఆర్వోలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సోమవారం సమావేశమైన ఆయన.. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, పొజిషన్ సర్టిఫికెట్లు లబ్ధిదారులకు అందివ్వాలని తెలిపారు.

విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వంగర: గరివిడి అభ్యాస్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం నిర్వహించిన పోటీ పరీక్షలో వంగర మండలం, లక్ష్మీపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థి భార్గవ్‌రామ్ విశేష ప్రతిభ కనబరిచాడు. జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా చేపట్టిన పరీక్షలో సదరు విద్యార్థి ప్రథమ స్థానంలో నిలిచి, మెమెంటో సహా రూ.5 వేలు అందజేశారు. ఈ మేరకు పాఠశాల సిబ్బంది విద్యార్థిని సోమవారం అభినందించారు.

కూరగాయల మొక్కలు పెంచండి



కిచెన్ గార్డెన్ నిర్వహణ నిధులు అందజేస్తున్న ఎంఈవోలు ప్రసాదరావు, ఎరకయ్య

రేగిడి: ప్రతి పాఠశాల ఆవరణలోని ఖాళీ స్థలంలో కూరగాయల మొక్కలు పెంచాలని ఎంఈవోలు ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్యలు సూచించారు. స్థానిక ఎమ్మార్సీలో మండలంలోని 30 పాఠశాలల ఉపాధ్యాయులకు కిచెన్ గార్డెన్‌ల నిర్వహణ నిమిత్తం రూ.5 వేలు చొప్పున నిధులు సోమవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పండించిన కూరగాయలను మధ్యాహ్న భోజన పథకం వంటకాల్లో వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మణరావు, రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

- గాలికుంటు వ్యాధిపై అప్రమత్తత అవసరం
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం
- ముమ్మరంగా వ్యాక్సినేషన్

టీకా.. పశువులకు రక్ష!



మర్రివలసలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న దృశ్యం

రామభద్రపురం: పశువులకు టీకాలే శ్రీరామరక్ష అని పశువైద్యులు చెబుతున్నారు. వాతావరణ మార్పులు మొదలవ్వగానే పశువులు ముఖ్యంగా గాలికుంటు వ్యాధి బారినపడే అవకాశం ఉంది. సకాలంలో వ్యాక్సిన్ వేస్తే వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చు. సమయానికి వైద్యం అందకపోతే పశువులు మృత్యువాత పడే అవకాశాలే ఎక్కువగా ఉంటాయి. ఈ నేపథ్యంలో జీవాలను రక్షించేందుకు ఉచిత టీకాల కార్యక్రమం(వ్యాక్సినేషన్) ప్రభుత్వం చేపట్టింది. ప్రస్తుతం బొబ్బిలి డివిజన్ వ్యాప్తంగా అన్ని పశువైద్య శాలల ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ ముమ్మరంగా కొనసాగుతోంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, జీవాలను కాపాడుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడీ ఎల్.విష్ణు సూచిస్తున్నారు.

వ్యాధి లక్షణాలు..

- ముందుగా పశువు నోటి నుంచి చొంగ కారడం ప్రారంభమవుతుంది. ఇదే సమయంలో పక్కనున్న పశువులకు కూడా వ్యాధి సోకే అవకాశం ఉంది.
- వ్యాధి సోకిన వాటికి 105 డిగ్రీల జ్వరం వస్తుంది. నోట్లో, కాలి గిట్టల్లో పుండు ఏర్పడుతుంది.
- నెల రోజుల వయసు దూడలు.. ఈ వ్యాధి ఉన్న పశువుల పాలు తాగితే వ్యాధి సోకి మరణిస్తాయి. వ్యాధి సోకిన పశువులు ఎక్కువ సేపు ఎండలో ఉండలేవు.
- దుక్కి దున్నే పశువుల కాళ్ల మట్టలు కదిలిపోతాయి. దీంతో అవి పనికిరావు.

నివారణ ఇలా..



ఎల్.విష్ణు, పశు సంవర్ధక శాఖ ఏడీ

వ్యాధి సోకిన వెంటనే పశువులను గుర్తించి, గుంపు నుంచి వేరు చేసి విడిగా కట్టేయాలి. ఇలా చేయకపోతే ఇతర పశువులకు వ్యాధి సోకే ప్రమాదం ఉంది. జీవాలు వ్యాధి బారినపడిన వెంటనే పశువైద్యుడిని సంప్రదించి వైద్యం చేయించాలి. వ్యాధి సోకక ముందు ఎఫ్ఎండీ వ్యాక్సిన్ వేయించాలి. వ్యాధి సోకిన తర్వాత పెన్సిలిన్, యాంటీ ఇస్టమిన్, యాంటీ ఇన్ఫ్లమేటరీ డ్రగ్స్ వాడుతూ నోటిలో, కాలి గిట్టల మధ్య గ్లిజరిన్‌తో శుభ్రం చేసి బోరిక్ పౌడర్ పట్టించాలి. వ్యాధి సోకక ముందే వ్యాక్సిన్ వేయించుకుని జాగ్రత్త పడాలి.

కూటమి ప్రభుత్వ దుర్మార్గాలకు చెంపపెట్టు

బొబ్బిలి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే కూటమి ప్రభుత్వ దుర్మార్గాలకు చెంపపెట్టు అని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి బొద్దల సత్యనారాయణ విమర్శించారు. ఇదే విషయమై ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో మోసపూరిత హామీలు, డబ్బులతో ప్రలోభపెట్టినట్లే ఉపాధ్యాయులను కూడా మోసం చేయాలని చూస్తే ఫలితాలు వేరేలా వచ్చాయన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలే నేరుగా పోలింగ్ శిబిరాల వద్ద హడావిడి చేసి ఓటర్లను ప్రభావితం చేయాలనుకున్నా వారు మద్దతు తెలిపిన అభ్యర్థి గెలవలేదని దుయ్యబట్టారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఇవే తరహా ఫలితాలు ఎదురై, చంద్రబాబు ప్రభుత్వాన్ని కోలుకోలేని విధంగా చేస్తారన్నారు.

గాదె గెలుపుపై హర్షం..

బాడంగి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు గెలుపొందడం పట్ల స్థానిక ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద పీఆర్‌టీయూ నాయకులు, ఉపాధ్యాయులంతా భారీ ఎత్తున సమావేశమై ఆలింగనం చేసుకుని, ఒకరినొకరు స్వీట్లు తినిపించుకుని ఆనందం వ్యక్తం చేశారు.

బీటీ రోడ్డు నిర్మాణం



సీతారామ థియేటర్ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

రాజాం: స్థానిక అంబేడ్కర్ జంక్షన్ నుంచి జీఎంఆర్ ఐటీ వరకు విస్తరిస్తున్న ప్రధాన రహదారి పనుల్లో ఎట్టకేలకు బీటీ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. లైనింగ్ పనులు పూర్తయిన చోట రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేశామని ఆర్అండ్‌బీ డీఈఈ ప్రసాదరావు తెలిపారు. మరోవైపు గాయత్రి కాలనీ రోడ్డులో కూడా బీటీ రోడ్డు నిర్మాణం వేగవంతానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ రోడ్ల విస్తరణకు గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే రూ.20 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు సమాచారం.

ఆర్థికసాయం

మెంటాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కుష్టు వ్యాధిగ్రస్తులకు ఆర్థికసాయం చేశారు. మొత్తం రూ.15,847 సేకరించి, ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ అరుణ ఆధ్వర్యంలో లెప్రసీ సొసైటీ ఎగ్జిక్యూటివ్ లెంక రమణకు సోమవారం అందజేశారు. విద్యార్థులంతా కుష్టువ్యాధితో బాధపడుతున్న వారి కోసం సహాయం చేయడం అభినందనీయమని సొసైటీ సభ్యులు, పాఠశాల సిబ్బంది మెచ్చుకున్నారు.

9 మంది గైర్హాజరు

రాజాం సిటీ: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షకు 9 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐవో ఎం.ఆదినారాయణ తెలిపారు. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభం కాగా తెలుగు, హిందీ, సంస్కృతం పరీక్షలకు రాజాం నియోజకవర్గంలోని 9 పరీక్ష కేంద్రాల్లో 2,271 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 2,262 మంది మాత్రమే హాజరయ్యారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని, దీనిలో భాగంగా సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశామన్నారు.

వితరణ

రాజాం సిటీ: ఎంతో కొంత ఇతరులకు సాయం చేయాలన్న భావన చాలా గొప్పదని ఎంఈవో పి.ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్థానిక పట్టణానికి చెందిన ఉట్ల మురళి, జయశ్రీ దంపతుల కుమార్తె ఆద్విక పుట్టినరోజు సందర్భంగా స్థానిక భవిత కేంద్రానికి పది కుర్చీలు, రెండు ఫ్యాన్లు సోమవారం వితరణ చేశారు. భవిత కేంద్రం విద్యార్థుల ఇబ్బందులు గుర్తించి, దాతలు సహకరించడం అభినందనీయమన్నారు.

గర్భిణులకు మధ్యాహ్న భోజనం

రేగిడి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తనిఖీల నిమిత్తం సోమవారం విచ్చేసిన గర్భిణులకు సత్యసాయిబాబా భక్తులు మధ్యాహ్న భోజనం పెట్టారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రతినెలా ఆరోగ్య తనిఖీలకు వస్తున్న గర్భిణులకు ఇలా భోజనాలు ఏర్పాటు చేసి ఇస్తున్నామని భక్తులు తెలిపారు.

బైక్ వెనక కూర్చొన్న వ్యక్తికీ హెల్మెట్ ఉండాల్సిందే..



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ ప్రసాదరావు

రామభద్రపురం: కొత్త వాహన చట్టం ప్రకారం ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తితో పాటు వెనక కూర్చొన్న వ్యక్తికీ హెల్మెట్ ఉండాల్సిందేనని ఎస్ఐ వి.ప్రసాదరావు సూచించారు. మండల కేంద్రంలో వాహన తనిఖీలు సోమవారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ బైక్ నడుపుతున్న వ్యక్తితో పాటు వెనక కూర్చొన్న వ్యక్తికి హెల్మెట్ లేకుంటే రూ.వెయ్యి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే రూ.10 వేలు, వాహనానికి బీమా లేకుంటే రూ.2 వేలు జరిమానా అన్నారు. ఇదే తప్పుతో రెండోసారి దొరికితే రూ.4 వేలు జరిమానా ఉంటుందన్నారు, శబ్ద, పొగ కాలుష్యానికి కారణమైతే రూ.2 వేల నుంచి రూ.4 వేలు, నిషేధిత పార్కింగ్‌కు రూ.1500 నుంచి రూ.3 వేల అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. అతివేగంగా వాహనం నడిపితే రూ.వెయ్యి నుంచి రూ.10 వేలు, మైనర్లు డ్రైవింగ్ చేస్తే రూ.వెయ్యి, ప్రయాణికులను ఎక్కిస్తే మనిషికి రూ.200 చొప్పున జరిమానా ఉంటుందన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపితే మొదటిసారి రూ.1500, రెండోసారి రూ.10 వేల వరకు ఫైన్(జరిమానా) ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా నూతన చట్టాలు అమలు చేశారన్నారు. వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

మహిళలను గౌరవించాలి



వంగర: సీతాదేవిపురం అంగన్‌వాడీ కేంద్రం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



బొబ్బిలి: మల్లంపేటలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో ఐసీడీఎస్ సిబ్బంది

వంగర/బొబ్బిలి/బొబ్బిలిరూరల్: మండలాల్లోని పలు గ్రామాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు సోమవారం చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సిబ్బంది.. మహిళలు, యువతులు, బాలికలు, చిన్నారుల పట్ల మిగతా వారు వ్యవహరించాల్సిన తీరును వివరించారు. ఎక్కడికక్కడ విచక్షణారహితంగా మహిళలపై అత్యాచారాలు జరుగుతుండడం బాధాకరమని, ప్రతిఒక్కరూ ఎదుట ఆడవాళ్లను తమ ఇంట్లోని ఆడవాళ్లుగా భావించి, గౌరవించాలని కోరారు. అనంతరం కొవ్వొత్తుల ర్యాలీ, ప్రతిజ్ఞ చేశారు.

కొలతల ప్రకారం పనిచేస్తేనే రోజుకు రూ.300



రామభద్రపురం: మామిడివలసలో వేతనదారులతో మాట్లాడుతున్న ఉపాధి పథకం ఏపీడీ రమామణి



రేగిడి: ఉప్పర్నాయుడువలసలో వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో హరనాధరావు

రేగిడి: నిర్దేశిత కొలతల ప్రకారం ఉపాధి హామీ పథకం పనులు చేస్తేనే రోజుకు రూ.300 వేతనం లభిస్తుందని ఏపీవో హరనాధరావు సూచించారు. మండలంలోని లక్ష్మీపురం, అక్కన్నఅగ్రహారం, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన సోమవారం పరిశీలించారు. గతంలో మాదిరి పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం రాదని, తోటల్లో కందకాలు, ఫారంపాండ్‌లు ఏర్పాటు చేసుకుంటే మంచి డబ్బులు వస్తాయన్నారు.

రామభద్రపురం: జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పిస్తామని ఉపాధి హామీ పథకం ఏపీడీ రమామణి అన్నారు. మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆమె సోమవారం పరిశీలించారు. ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తేనే పూర్తి వేతనం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో త్రినాదరావు పాల్గొన్నారు.

స్త్రీనిధి మంజూరు లక్ష్యాలు అధిగమించాం

వంగర: స్వయం శక్తి సంఘాల మహిళలకు ఇచ్చే స్త్రీనిధి రుణాల మంజూరు లక్ష్యాలు అధిగమించామని స్త్రీనిధి మేనేజర్ పూడి సుధాకరరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సీసీలతో సోమవారం సమావేశమైన అనంతరం విలేకరులతో మాట్లాడిన ఆయన.. రాజాం నియోజకవర్గంలోని 202 గ్రామైక్య సంఘాలు ఉన్నాయని, వాటి పరిధిలో 7,413 మహిళా స్వయం శక్తి సంఘాలు ఉన్నాయని పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.28.50 కోట్ల స్త్రీనిధి రుణాల మంజూరు లక్ష్యం కాగా ఇప్పటివరకు 5,380 మంది సభ్యులకు రూ.28.89 కోట్ల రుణాలు మంజూరు చేశామన్నారు. ఈ ఏడాది 98.5 శాతం రుణాల రికవరీ చేపట్టామన్నారు. స్త్రీనిధి ద్వారా మంజూరు చేసిన రుణాలను సద్వినియోగం చేసుకుని, మహిళలు జీవనోపాధి మెరుగుపరుచుకోవాలని కోరారు.

రూ.5 కోట్ల పన్ను వసూళ్లు లక్ష్యం

బొబ్బిలి: ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి మొత్తం రూ.5 కోట్ల పన్ను వసూళ్లు లక్ష్యంగా చేసుకున్నామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి తెలిపారు. ఇదే విషయమై సోమవారం విలేకరులతో మాట్లాడిన ఆమె.. గతేడాది ఫిబ్రవరి చివరికి రూ.2.85 కోట్లు వసూలు చేస్తే ఈ ఏడాది 3.61 ఆస్తిపన్ను వసూలు చేసినట్లు తెలిపారు. రూ.80 లక్షలు అధికంగా వసూలు చేశామన్నారు. అలాగే తాగునీటి పన్ను గతేడాది నుంచి రూ.27 లక్షలు వసూలు చేస్తే ఈ ఏడాది రూ.51 లక్షలు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలంతా పన్నులు త్వరగా చెల్లించి, మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పెరుగుదల తక్కువున్న చిన్నారులను గుర్తించండి

రేగిడి: పెరుగుదల తక్కువున్న చిన్నారులను గుర్తించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత సూచించారు. మండలంలోని ఉంగరాడ, కేఎంవలస, వన్నలి తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సోమవారం తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఇవ్వాల్సిన పౌష్టికాహారం సకాలంలో పంపిణీ చేయాలని సూచించారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనం దివ్వడంతో పాటు వారి ఆరోగ్యంపైనా దృష్టిసారించాలని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయోత్పత్తులతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు(ప్రకృతి వ్యవసాయోత్పత్తులు) ఆరోగ్యానికి మేలు అని ప్రకృతి వ్యవసాయం మరువాడ యూనిట్ ఇన్‌చార్జ్ సింహాద్రినాయుడు తెలిపారు. వంగర మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి సేద్యం ద్వారా తయారైన కూరగాయల విక్రయాలు సోమవారం చేపట్టారు. ఎటువంటి రసాయనాలు వినియోగించకుండా సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన ఉత్పత్తులు చాలా మంచివి కావడంతో వాటిని కొనుగోలు చేసేందుకు జనం ఎగబడ్డారు. ప్రతిఒక్కరూ ప్రకృతి సేద్యం అనుసరించి, ఆరోగ్యవంతమైన సమాజ ఆవిష్కరణలో భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు. – వంగర

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్



జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా రామభద్రపురంలోని గ్లోబల్ వ్యూ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ ఆకట్టుకుంది. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్న విద్యార్థులంతా మొత్తం 200 ప్రాజెక్టులు రూపొందించి, ప్రదర్శించారు. ముఖ్యంగా రామాయణ్ పప్పెట్ షో వీక్షకులను అలరించింది. విజ్ఞాన ప్రదర్శనలు విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలికితీసేందుకు దోహదం చేస్తాయని, విద్యార్థులంతా శాస్త్రవేత్తలుగా ఎదగాలని కరస్పాండెంట్ చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ సంధ్యలు ఆకాంక్షించారు. – రామభద్రపురం

ఆస్పత్రి కిటకిట



బొబ్బిలి సీహెచ్‌సీకి రోగుల తాకిడి రోజురోజుకూ ఎక్కువవుతోంది. చుట్టుపక్కల నాలుగైదు మండలాల ప్రజలకు ఏ ఆరోగ్య సమస్య వచ్చినా ఈ ఆస్పత్రే దిక్కు. గతంలో ఒకరిద్దరు వైద్యులే ఉండగా, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మొత్తం 8 విభాగాలకు చెందిన వైద్యుల నియామకం జరగడంతో సాధారణ వైద్యానికి కొదవ లేకుండా పోయింది. దీంతో పట్టణవాసులతో పాటు చుట్టుపక్కల వారంతా ఇక్కడికే వచ్చి వైద్యసేవలు పొందుతున్నారు. గత వారం రోజులుగా రోజుకు 300 మంది వరకు ఓపీ సేవలు పొందుతున్నారని, మరికొంతమంది ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారని సమాచారం. – బొబ్బిలి

వేధిస్తోన్న ట్రాఫిక్ సమస్య



బాడంగి మండల కేంద్రం వచ్చే వాహనదారులను ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. స్థానిక మెయిన్ రోడ్డు ఆక్రమణకు గురై చిన్నదిగా మారడంతో భారీ వాహనాలు వచ్చేటప్పుడు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ సమస్య తొలగేలా రోడ్డు ఆక్రమణలు తొలగించి, రోడ్డు విస్తరణ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. – బాడంగి

పైడితల్లి జాతరను విజయవంతం చేయాలి



ఆలయం వద్ద జాతర ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ అశోక్‌కుమార్, ఈవో మాధవరావు

రాజాం: పట్టణంలో ఈ నెల 9వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనున్న పోలిపల్లి పైడితల్లి జాతరను విజయవంతం చేయాలని జాతర కమిటీ సభ్యులు కోరారు. ఆలయ ఆవరణలో దేవదాయ శాఖ ఈవో బలివాడ వైకుంఠమాధవరావు.. కమిటీ సభ్యులతో కలిసి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఆలయ 99వ వార్షికోత్సవంలో భాగంగా ఈ ఏడాది జాతరను పెద్దఎత్తున నిర్వహిస్తున్నామని, మూడు రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 7న నేత్రోత్సవం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్ కుటుంబీకులతో పసుపు, కుంకమ సమర్పణ, సాయంత్రం కొండంపేటలో వనంగుడి వద్ద ఘటాల పూజారి లంకలపల్లి సత్యన్నారాయణ కుటుంబీకులతో ఖడ్గపూజ ఉంటుందన్నారు. ఈ నెల 9న ఉదయం 5 గంటలకు జాతర ప్రారంభం, విశేష పూజలు, భక్తులకు సాధారణ దర్శనాలు ఉంటాయన్నారు. రాత్రి 8 గంటలకు ఎస్‌వీఆర్ పరిషత్ అధ్యక్షులు సలాది తులసీదాస్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర స్థాయి మహిళా కళాకారిణిలతో పౌరాణిక, జానపద, సాంఘిక నాటకాలతో పాటు సత్యహరిశ్చంద్ర నాటకంలోని కాటిసీన్లు ఉంటాయన్నారు. ఈ నెల 10న అమ్మవారికి పూజలు, రాత్రి 9 గంటలకు హైదరాబాద్ సినీ నటులతో ఢీ, జబర్దస్త్ హంగామా ఉంటుందన్నారు. ఈ నెల 11న అమ్మవారికి విశేష పూజలు, ప్రత్యేక భోగం, విశేష పుష్పాలంకరణ అనంతరం దర్శన కార్యక్రమాలు ఉంటాయన్నారు. అదేరోజు రాత్రి 12.09 గంటలకు ఘటోత్సవంతో జాతర ముగుస్తుందన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 300 మంది వరకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అంతకుముందు రాజాం టౌన్ సీఐ అశోక్ కుమార్‌తో కలసి జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు, ఆలయ ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజాంలో బైక్ దొంగతనాలు

రాజాం సిటీ: పట్టణంతో పాటు మండలంలో ద్విచక్ర వాహనాల దొంగతనాలు అధికమయ్యాయి. దీంతో పట్టణవాసులతో పాటు మండల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరుబయట పెట్టిన బైక్‌లతో పాటు ఇంటి ఆవరణ, వరండాల్లో తాళం వేసిన బైక్‌లను సైతం దొంగలు ఎత్తుకెళ్లిపోతున్నారు. ఈ నెల 2వ తేదీన మొగిలివలస గ్రామంలోని ఇంటి వరండాలో ఉంచిన లెంక గణేష్ బైక్‌ను గుర్తు తెలియని పట్టుకుపోయారు. గత నెల 15వ తేదీన రాజాం మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామానికి చెందిన రెడ్డి శ్రీనివాసరావు బైక్‌ను దొంగలు పట్టుకుపోయారు. వీటితో పాటు శ్రీకాకుళం రోడ్డులోని రామ్‌నగర్, పాలకొండ రోడ్డులోని బాబానగర్‌లలో పది రోజుల క్రితం వాహనాలు పోయాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశామని సీఐ అశోక్‌కుమార్ తెలిపారు.